తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 48 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ మంగళవారం17-09-2023 వెల: 5/రూ -



## విఘ్ననాయకుడికి వీడ్కోలు నేడు

ఖైరతాబాద్‌లో కొలువైన మహా గణపతి నుంచి..

గల్లీల్లోని గణనాథుల వరకు మంగళవారం నిమజ్జనానికి కదలనున్నారు.

గ్రేటర్‌లో 73 ప్రాంతాల్లో నిమజ్జనం

విధుల్లో 15 వేల మంది జీహెచ్‌ఎంసీ సిబ్బంది

35 వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు

హైదరాబాద్: ఖైరతాబాద్‌లో కొలువైన మహా గణపతి నుంచి.. గల్లీల్లోని గణనాథుల వరకు మంగళవారం నిమజ్జనానికి కదలనున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

2లో

## వచ్చే నెల నుంచి కొత్త రేషన్ దరఖాస్తులు

### జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ

మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

వేర్వేరుగా స్మార్ట్ రేషన్‌కార్డులు, స్మార్ట్ హెల్త్ కార్డుల జారీ

బియ్యం అవసరం లేనివారికి స్మార్ట్ హెల్త్ కార్డులు

లబ్ధిదారుల ఆదాయ పరిమితి, అర్హతలపై నిబంధనల పునః సమీక్ష

21న జరిగే మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో తుది నిర్ణయం

19వ తేదీలోగా ప్రజాప్రతినిధులంతా తమ అభిప్రాయాలను పంపాలని విజ్ఞప్తి



2లో

హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల కోసం అక్టోబర్ నుంచి దరఖాస్తులు స్వీకరించి, వేగంగా జారీ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రేషన్‌కార్డులను విభజించి స్మార్ట్ రేషన్ కార్డులు, స్మార్ట్ హెల్త్ కార్డులను వేర్వేరుగా జారీ చేస్తామన్నారు. రేషన్ బియ్యం అవసరం లేకున్నా ఆరోగ్యశ్రీ వంటి ప్రయోజనాల కోసం తెల్లరేషన్ కార్డులున్న వారి కోసం ప్రత్యేకంగా స్మార్ట్ హెల్త్ కార్డులను జారీ చేస్తామని వెల్లడించారు. కొత్త రేషన్‌కార్డులు, హెల్త్ కార్డుల జారీపై మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో నాలుగోసారి సమావేశమై చర్చించింది. ప్రభుత్వానికి కొన్ని మధ్యంతర సిఫార్సులు చేసింది. అనంతరం మంత్రులు ఉత్తమ్, పొంగులేటి మీడియాతో మాట్లాడారు. తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారుల అర్హతలను పునఃసమీక్షిస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ నెల 21న ఇంకోసారి సమావేశమై కొత్త విధివిధానాలను ఖరారు చేస్తామని చెప్పారు.

## కొత్త సీఎంపై సర్వత్రా ఉత్కంఠ

ఎల్జీకి సమర్పించనున్న కేజ్రీవాల్

రోజంతా నేతలతో మల్లగుల్లాలు

నేడు ఎమ్మెల్యేల భేటీలో నిర్ణయం

ఎస్సీ, మైనారిటీ నేతల పేర్లు



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం రాజీనామా చేయనున్నారు. సాయంత్రం 4.30కు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆయనకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఆ సందర్భంగా ఎల్జీకి కేజ్రీవాల్ రాజీనామా లేఖ సమర్పిస్తారని ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ సోమవారం మీడియాకు తెలిపారు. రెండు రోజుల్లో రాజీనామా చేస్తానని, ప్రజలు గెలిపించాకే తిరిగి సీఎం కుర్చీలో కూర్చుంటానని

2లో



## తెలంగాణ తల్లికి నేడు పాలాభిషేకాలు: కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వ చర్యకు ఎక్కడికక్కడ నిరసన

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రాజీవ్ విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తుందని వెల్లడి

హైదరాబాద్: రాష్ట్ర సచివాలయానికి, తెలంగాణ అమర జ్యోతికి మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడం తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టుపెట్టే సిగ్గుమాలిన చర్యగా భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి చర్యకు నిరసనగా మంగళవారం రాష్ట్రంలోని అన్ని తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలభిషేకాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## దిగొచ్చిన దీదీ

### జూడాల కీలక డిమాండ్లకు అంగీకారం

కోల్‌కతా పోలీసు కమిషనర్ గోయల్‌పై వేటు

వైద్యవిద్య డైరెక్టర్ తొలగింపు

ఆరోగ్య సేవల డైరెక్టర్ కూడా

ఎలాంటి క్రమశిక్షణ చర్యలుండవు

విధుల్లో చేరాలని వినతి

చర్చించి చెబుతామన్న జూడాలు



2లో

కోల్‌కతా: మమతా బెనర్జీ సర్కారు దిగివచ్చింది. జూనియర్ డాక్టర్ల ఐదు డిమాండ్లలో మూడింటిని ఆమోదించింది. వైద్య విద్య డైరెక్టర్, ఆరోగ్య సేవల డైరెక్టర్‌లను తొలగించడానికి అంగీకరించింది.

## జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు

తనపై పలుమార్లు వేధింపులకు పాల్పడ్డాడని సహాయకురాలి ఫిర్యాదు

మతం మార్చుకుని పెళ్లి చేసుకోవాల్సిందిగా బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్న బాధితురాలు

కేసు నమోదు చేసిన పోలీసులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని జనసేన ఆదేశం



## నేడు కేంద్రం ఆధ్వర్యంలో 'విమోచనం'

సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కేంద్ర సాంస్కృతికశాఖ

ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవం నిర్వహిస్తోంది. ఉదయం 7.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన కళాకారుల ప్రదర్శనలు నిర్వహిస్తారు. 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'ద్వారా 'సెప్టెంబర్ 17%-%హైదరాబాద్ విమోచన దినం'ప్రాధాన్యత వివరించేలా సంక్షిప్త ప్రదర్శన ఉంటుంది.



## ప్రమాద వషాత్తు గుంతలో పడి బాలిక మృతి

**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోని పిప్పిరి గ్రామం సమీపంలోని స్టోన్ క్రెషర్లో పని చేస్తున్న కూలీ కుటుంబం కు చెందిన ఒక బాలిక ప్రమాద వషాత్తు నీటి గుంతలో పడి మృతి చెందింది. ఛత్తిష్ ఘడ్ రాష్ట్రంకు చెందిన భరత్ కుటుంబం వచ్చి పిప్పిరి వద్ద గల స్టోన్ క్రెషర్ లో కూలీ పని చేస్తున్నారు. అతని 12 సంవత్సరాల కూతురు సంజన క్రెషర్ వద్ద గల గుంత వద్దకు నీటి కోసం వచ్చి ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయి మృతి చెందినదని బజార్ హత్నూర్ పోలీస్ అధికారి తెలిపారు. బాలికకు పిట్స్ ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## విఘ్ననాయకుడికి వీడ్కోలు నేడు

(మొదటి పేజీ తరువాయి)

హుస్సేన్ సాగర్‌తో పాటు సరూర్‌నగర్, కాప్రా తదితర ప్రాంతాల్లోని పెద్ద, చిన్న చెరువులు, పోర్టబుల్ పాండ్స్‌తో కలిపి 73 ప్రాంతాల్లో నిమజ్జనం చేయనున్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ, ఇతర పనులకు 160 గణేష్ యాక్షన్ టీంలను జీహెచ్‌ఎంసీ రంగంలోకి దింపింది. వివిధ విభాగాలకు చెందిన 15 వేల మంది సిబ్బంది విధుల్లో ఉండనున్నారు. హైదరాబాద్ సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో 35 వేల మందిపైగా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. హుస్సేన్‌సాగర్ తీరంలోనే 3 వేల మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని పోలీస్ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. శోభాయాత్ర మార్గాల్లో విద్యుత్తు లైన్లు అడ్డు రాకుండా, సరఫరాలో అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేలా టీజీఎస్‌పీడీసీఎల్ సిబ్బందిని రంగంలోకి దింపింది. ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్ వద్ద 8, పెద్ద చెరువుల వద్ద మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంచారు. ప్రధాన నిమజ్జన ప్రాంతాల్లో మరుగుదొడ్లు, వాటర్ క్యాంప్‌లు, వైద్య శిబిరాలు, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ తీరం వరకు 18 కి.మీ. మేర ప్రధాన శోభాయాత్ర సాగనుంది. వేర్వేరు ప్రాంతాల నుంచి గణనా?థుల ఊరేగింపు జరిగే మార్గాలు 300 కి.మీ. పైగా ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణకు 3, 4 కి.మీలకు ఒకటి చొప్పున గణేష్ యాక్షన్ టీంలు ఉంటాయి. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, సంజీవయ్య పార్కు, బేబి పాండ్‌ల వద్ద 38 క్రేన్లు ఉన్నాయని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. నిమజ్జన ప్రక్రియకు ఆటంకం లేకుండా సాగర్ తీరం చుట్టూ పోలీసులు బారికేడ్లు పెట్టారు. అదనంగా 733 సీసీ కెమెరాలు బిగించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రత్యేక ఐటీ బృందం శోభాయాత్రను పర్యవేక్షించనుంది. నిమజ్జన ఊరేగింపులో రంగురంగుల పేపర్లు చల్లొద్దని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కోరారు.

## కొత్త సీఎంపై సర్వత్రా ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ అసెంబ్లీకి నవంబర్లోనే ముందస్తు ఎన్నికలు పెట్టాలని కూడా ఆ సందర్భంగా ఆయన ఈసీని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం రోజంతా ఆప్ నేతలతో కేజ్రీ సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. తన ప్రకటనపై స్పందన ఎలా ఉందని పార్టీ అత్యున్నత నిర్ణాయక విభాగమైన రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీలో ఆరా తీశారు. సీఎం అభ్యర్థిపై ఒక్కక్కరి నుంచీ వ్యక్తిగతంగా అభిప్రాయాలు సేకరించారు. అంతకుముందు ఉదయం కీలక నేతలు మనీశ్ సిసోడియా, రాఘవ్ ఛద్దా తదితరులతోనూ ఈ అంశంపై లోతుగా చర్చలు జరిపారు. సీఎం పదవికి మంత్రులు ఆతిశి, గోపాల్ రాయ్, కైలాశ్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్ తదితరుల పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు స్పీకర్ రాంనివాస్ గోయల్, కేజ్రీవాల్ భార్య సునీత పేర్లపైనా లోతుగా చర్చ జరుగుతున్నట్టు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో 12 ఎస్సీ రిజర్వుడు శాసనసభ స్థానాలున్నాయి. కనీసం మరో ఆరు స్థానాల్లో మైనారిటీలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, లేదా మైనారిటీ నేతకు చాన్స్ దక్కొచ్చన్న వాదనా ఉంది. దాంతో ఎస్సీ, మైనారిటీ వర్గానికి చెందిన పలువురు ఆప్ ఎమ్మెల్యేల పేర్లు కూడా కొత్తగా తెరపైకి వస్తున్నాయి! మంగళవారం కేజ్రీవాల్ రాజీనామాకు ముందు ఉదయం 11.30కు ఆప్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం జరగనుంది. సీఎం అభ్యర్థిపై ఈ భేటీలో తుది నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు. మైనారిటీ వర్గానికి చెందిన ఆప్ ఎమ్మెల్యే ఇమ్రాన్ హుసేన్ పేరు ఖరారైనా ఆశ్చర్యం లేదని ఆప్ ముఖ్య నేత ఒకరు చెప్పడం విశేషం!

## దిగొచ్చిన దీదీ

(మొదటి పేజీ తరువాయి)

వైద్యురాలి తల్లిదండ్రులకు డబ్బు ఇవ్వజూపారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కోల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ పైనా వేటు వేసింది. మంగళవారం కొత్త కమిషనర్‌ను నియమిస్తామని సీఎం మమత ప్రకటించారు. వినీత్ గోయల్ కమిషనర్‌గా కొనసాగడానికి సుముఖంగా లేరన్నారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ (నార్త్)ను తొలగించాలని నిర్ణయించామన్నారు. జూనియర్ల డాక్టర్ల ఇతర డిమాండ్లను పరిశీలించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. ఐదింటిలో మూడు డిమాండ్లను అంగీకరించినందుకు సమ్మె విరమించి విధులకు హాజరు కావాలని జూనియర్ డాక్టర్లను కోరినట్లు మమత వెల్లడించారు. సోమవారం రాత్రి 12 గంటల తర్వాత మమత మీడియాతో మాట్లాడుతూ సమావేశపు వివరాలను వెల్లడించారు. 42 మంది జూనియర్ డాక్టర్లు, బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ సమావేశపు మినిట్స్‌పై సంతకాలు చేశారని మమత తెలిపారు. జూడాలపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు ఉండవని ప్రకటించారు. చర్చించుకొని తమ నిర్ణయం చెబుతామని జూనియర్ డాక్టర్లు తెలిపారని మమత వెల్లడించారు.

# జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు

(మొదటి పేజీ తరువాయి)

మణికొండ: సినిమాల్లో నృత్య దర్శకునిగా పనిచేస్తూ పాపులర్ అయిన జానీ మాస్టర్ తనపై పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పుడినట్టు అతని సహాయకురాలు (21) పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్, చెన్నై, ముంబై తదితర నగరాల్లో ఔట్‌డోర్ షూటింగ్‌లలో పాల్గొన్నప్పుడు ఆయన తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే నార్సింగిలోని తన నివాసానికి వచ్చి పలుమార్లు వేధింపులకు గురి చేశాడని వివిధ ఆధారాలతో ఆమె ఆదివారం రాత్రి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన మతం మార్చుకుని అతడిని వివాహం చేసుకోవాలంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని ఆ యువతి ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, బాధితురాలు ఉండేది నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో కావటంతో రాయదుర్గం పోలీసులు ఎఫ్ఐఆర్ నంబర్ 1371/2024 ప్రకారం సెక్షన్ 376 (రేప్), 506 (క్రిమినల్ బెదిరింపులు), 323(2) గాయపర్చడం వంటి సెక్షన్ల కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇదిలా ఉండగా జానీ మాస్టర్‌కు గతంలోను నేరచరిత్ర ఉందని, 2015లో ఓ కాలేజీలో మహిళపై దాడి కేసులో 2019లో మేడ్చల్ కోర్టు అతనికి ఆరునెలల జైలుశిక్ష విధించిందని పోలీసులు తెలిపారు. ఇటీవల ఆయన రాజకీయాల్లోచేరి ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ తరఫున గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేశారు. కేసు తమ స్టేషన్‌కు వచ్చిందని, విచారణ చేస్తున్నామని నార్సింగి సీఐ హరికృష్ణారెడ్డి తెలిపారు. మరో పక్క సఖీ బృందం బాధితురాలి వద్ద రహస్య ప్రదేశంలో వివరాలు సేకరించింది.



**బాధితుల గోప్యతను కాపాడాలి**

'ఓ ఇష్యూ కోర్టులో ఉన్నప్పుడు ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు సంబంధిత వ్యక్తుల తాలూకు ముసుగు లేని ఫొటోలను, వీడియోలను ఉపయోగించవద్దని, ఒకవేళ ఇప్పటికే ఉపయోగించినట్లయితే వెంటనే తీసివేయాలని కోరుతున్నాం' అని తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి ఓ నోట్‌ని విడుదల చేసింది. బాధిత పార్టీల గోప్యతను కాపాడాలని అన్ని ప్రింట్, డిజిటల్, ఎలక్ట్రానిక్ మీడియాలను అభ్యర్థిస్తున్నాం.. అంటూ తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి తరఫున గౌరవ కార్యదర్శి కె.ఎల్.దామోదర్‌ప్రసాద్ ఆ నోట్‌లో పేర్కొన్నారు.

# వచ్చే నెల నుంచి కొత్త రేషన్ దరఖాస్తులు



(మొదటి పేజీ తరువాయి)

అర్హులైన అందరికీ రేషన్‌కార్డులు జారీ చేయాలని నిర్ణయించామన్నారు. తెలంగాణ ఏర్పాటైన నాటికి 91,68,231 రేషన్‌కార్డులు, 3,38,07,794 మంది లబ్ధిదారులు ఉంటే.. గత ప్రభుత్వం పాత రేషన్‌కార్డులన్నీ రద్దు చేసి కొత్తగా దరఖాస్తులు స్వీకరించిందని చెప్పారు. అప్పట్లో 89,21,907 కొత్త రేషన్‌కార్డులను జారీ చేయగా.. 2,70,36,250 మంది లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89.6 లక్షల కార్డులు, 2.81 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం లబ్ధిదారుల వార్షికాదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షల్లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల్లోపు ఉండాలని.. 3.5 ఎకరాలు/ఆ లోపు తడి, 7.5 ఎకరాలు/ఆ లోపు మెట్ట భూములు ఉండాలని చెప్పారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్‌లలో అమలు చేస్తున్న ఆదాయ పరిమితులను పరిశీలించామని.. రాష్ట్రంలో లబ్ధిదారుల ఆదాయ పరిమితిని పెంచాలా? తగ్గించాలా? ప్రస్తుత నిబంధనలనే కొనసాగించాలా? అన్న అంశాలపై తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కొత్త రేషన్‌కార్డుల జారీ విషయంలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలు కోరుతూ లేఖలు రాయగా.. ఇప్పటివరకు 16 మంది నుంచి స్పందన వచ్చిందన్నారు. మిగతావారు ఈ నెల 19లోగా అభిప్రాయాలను పంపితే.. పరిశీలిస్తామని చెప్పారు.

**జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ..**

తెల్ల రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీని జనవరి నుంచి ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. నిరుపేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పులకు ఈ పథకం దోహదపడుతుందని చెప్పారు. దొడ్డు బియ్యం బ్లాక్ మార్కెటింగ్, రిసైక్లింగ్‌కు దారితీస్తోందని.. సన్న బియ్యంతో ఈ సమస్య ఉండదని వివరించారు. వానాకాలంలో పండించిన సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ అందిస్తామని తెలిపారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి కొత్త రేషన్ కార్డులు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆసరా పెన్షన్లు ఇచ్చిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. 2016%-%2024 మధ్య కాలంలో 6,47,479 కొత్తకార్డులు జారీ చేయగా.. 5,98,000 కార్డులను తొలగించిందని చెప్పారు. అంటే ఇచ్చినది 49,476 కార్డులేనని పేర్కొన్నారు. తాము పారదర్శకత కోసం ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సేకరిస్తున్నామని, వారు విలువైన సలహాలిస్తే భేషజాలకు పోకుండా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

# తెలంగాణ తల్లికి నేడు పాలాభిషేకాలు: కేటీఆర్



తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యను ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులతో సహా తెలంగాణ వాదులంతా వ్యతిరేకిస్తూ నిరసన తెలుపాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటమేంటని తెలంగాణ సమాజమంతా ఆవేదన చెందుతోందని, రేవంత్‌రెడ్డి వెంటనే తాను చేసిన తప్పును సరిదిద్దుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే కచ్చితంగా తెలంగాణ ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్పటం ఖాయమని హెచ్చరించారు.

**ఉద్యమానికి సంబంధం లేని వ్యక్తి విగ్రహావిష్కరణా?**

'తెలంగాణ తల్లి విగ్రహం కోసం స్థలాన్ని కేసీఆర్ 2023 జూలైలోనే ఎంపిక చేశారు. యావత్తు తెలంగాణ సమాజం కూడా తెలంగాణ తల్లిని గౌరవించుకునేందుకు కేసీఆర్ ఎంపిక చేసిన స్థలానికి ఆమోద ముద్ర వేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కుసంస్కారంతో తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని వ్యక్తి విగ్రహాన్ని ఆ స్థలంలో ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ చర్య ప్రతి తెలంగాణ వ్యక్తి మనసునూ గాయపర్చేలా ఉంది. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తాం. సకల మర్యాదలతో గాంధీ భవన్‌కు తరలిస్తాం..'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**ఢిల్లీ మెప్పు కోసమే!**

'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి ఢిల్లీకి బానిసత్వం చేస్తారని మేం ముందుగానే చెప్పాం. రేవంత్‌రెడ్డి ఇప్పుడు అదే పనిచేస్తున్నారు. ఢిల్లీ బాసుల మెప్పు కోసమే తెలంగాణ ఆత్మను తాకట్టు పెడుతున్నారు. తెలంగాణ ప్రజలు, తెలంగాణ మనోభావాల కన్నా కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఢిల్లీ బాసుల మెప్పు పొందటమే ముఖ్యమైపోయింది. తెలంగాణ ఉద్యమకారులమంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ నాయకులంతా ఢిల్లీకి గులాములేనని తేలిపోయింది. తెలంగాణ అస్తిత్వంతో పెట్టుకున్న వాళ్లెవరూ రాజకీయంగా బతికి బట్టకట్టలేదు. తెలంగాణ ప్రజలు వారికి రాజకీయంగా సమాధి తవ్వటం ఖాయం..'అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వం, ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ మాత్రమే రాజీలేని పోరాటం చేస్తుందని చెప్పారు. తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామరక్షగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ సచివాలయం ఎదుట దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుపై అనవసర రాజకీయాలకు తెరలేపొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. రాజీవ్ గాంధీ విగ్రహంపై పిచ్చి ప్రేరాప...

**తెలంగాణ తల్లిని అవమానిస్తారా? కేటీఆర్**


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ముందు కాంగ్రెస్ ప్రభుత్వం దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విరుచుకుపడ్డ...

'కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి ప్రభుత్వం ఏర్పాటు చేసుడే ఎక్కువ.. రెండుసార్లు గెలుస్తారని అనుడం పగటి కలలు కనడుమే' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.



## నేడు కేంద్రం ఆధ్వర్యంలో 'విమోచనం'


ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు పోలీసు బలగాలు, సైనికదళాల పరేడ్ ఉంటుంది. 9 గంటలకు కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, గజేంద్రసింగ్ చౌహాన్, బండి సంజయ్ పరేడ్ గ్రౌండ్స్‌లోని యుద్ధస్మారకం వద్ద నివాళులర్పిస్తారు. ఉదయం 9.15 గంటలకు జి.కిషన్‌రెడ్డి జాతీయపతాకాన్ని ఎగురవేస్తారు. కేంద్ర మంత్రులు సర్దార్ వల్లబాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తారు. 9.20 గంటలకు కేంద్ర సాయుధ బలగాల నుంచి కిషన్‌రెడ్డి గౌరవవందనం స్వీకరిస్తారు. అనంతరం 700 మందికిపైగా కళాకారులు మంగళవాద్యం, బతుకమ్మ, కొమ్ముకోయ, బోనాలు%-%పోతరాజు, డప్పులు, కోలాటం, లంబాడీ, గుస్సాడి, ఒగ్గు కథ తదితరాలను ప్రదర్శిస్తారు. చివరగా 'హైద రాబాద్ విమోచన దినం శకటం ప్రదర్శన ఉంటుంది. 10.10 గంటలకు కేంద్ర సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి ఉమా నందూరి స్వాగతోపన్యాసం చేస్తారు. తర్వాత బండి సంజయ్ ప్రసంగిస్తారు. రాష్ట్రం నుంచి పద్మ అవార్డులకు ఎంపికైన ఆరుగురిని సన్మానిస్తారు. 10.30 గంటలకు కిషన్‌రెడ్డి ప్రసంగిస్తారు.






# ఒంటరి కుటుంబ సభ్యుల గుర్తింపు ఆప్షన్ ఎప్పుడు వస్తుంది






**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మాకంగా చేపట్టిన రైతు ఋణం మాఫీ లో కొన్ని లొసుగులు సవరించవల్సిన అవసరం ఉందని పలువురు రైతులు, రైతు శ్రేయోభిలాషులు ప్రభుత్వం ను డిమాండ్ చేస్తూ అభిప్రాయం లు తెలుపుతున్నారు. ప్రభుత్వం వారి అభిప్రాయం లు రైతుల సంక్షేమం దృష్ట్యా సూచనగా స్వీకరించి రైతులకు న్యాయం జరుగునట్లు చూడాలని కోరుతున్నారు. ఆ సూచనలు ఈ విదంగా ఉన్నాయి.రాష్ట ప్రభుత్వం రైతుల ఋణం మాఫిని పూర్తి చేయుటకుకొన్నిఇబ్బందులువస్తున్నాయి. అలాంటి వారిలో ఒంటరిగా ఉంటున్న వారి రుణ మాఫీ -2024 ఆప్షన్ ఎప్పుడు వస్తుంది. ఋణం మాఫీ ఎప్పుడు పూర్తి అవుతుంది అని అయోమయంకు గురి అవుతున్నారు.కొంతమంది ఒంటిరి మహిళలకు వారి కుటుంబ సర్వేలో భాగంగా కుటుంబ పెద్ద పేరు మీద ఉదాహరణ కు ఒక లక్ష ఋణం ఉన్నది అనుకుంటే, ఆ ఋణం మాఫీ కోసం భార్య, భర్త లు ఇద్దరు కల్సి సంబందిత వ్యవసాయ అధికారి వద్ద సెల్ఫీ ఫొటో దిగి, కుటుంబ వివరాలు ఇస్తే వాటిని అధికారులు నమోదు చేసిన పిదప వారికి ఋణం మాఫీ వస్తుంది. ఒక వేళ దిగని పక్షంలో కుటుంబసర్వే జరుగనట్లే.అయితే ఈ కుటుంబ సర్వేకు కుటుంబం లోని సభ్యులకు సంబంధం గల ఆధార్ కార్డులు అవసరం అని చెపుతున్నారని రైతులు చెపుతున్నారు. కుటుంబంలో ఎవరైనా మరణించిన యెడల వారి కుర్తింపు కోసం మరణించిన వారి ఆధార్ ధ్రువీకరణ తేవల్సినదిగా వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఆధార్ కుర్తింపులో కొంతమంది కి ఆధార ధ్రువీకరణ పత్రాలు లేవు. అది ఎలా అంటే ఆధార్ కార్డులు అనేవి 2011 సంవత్సరము నుంచి మాత్రమే ఆధార్ కార్డులు అనేవి అమలులోకి వచ్చాయి. అంతకు ముందు 2010 వరకు ఆధార్ కార్డులు లేవు. ఆధార్ కార్డులు లేని ఒంటరీ మహిళల కుటుంబ సర్వే చేయడం లేదు. భర్త ఆధార్ కార్డు కావాలని అధికారులు అంటున్నారు. లేకుంటే మీలాంటి వారికి సంబంధం గల ఆప్షన్ లు రాలేదని ఆప్షన్లు వచ్చిన పిదప కుటుంబ సర్వే చేస్తామని అప్పుడే మీ ఋణం మాఫీ వస్తుందని అధికారులు చెప్పుతున్నారు. భర్త ఉండి భార్య మరణించిన కూడా ఇదే సమస్య ఉంది. ఇలాంటి వారిని కూడా త్వరగా కుటుంబ సర్వేలో గుర్తింపు కోసం ఆప్షన్ ను వ్యవసాయ అధికారులు ప్రవేశ పెట్టి ఒంటరీ మహిళలకు ఋణం మాఫీ అయ్యేట్లు చూడాలని ప్రభుత్వంనువేడుకొంటున్నారు.ఉదాహరణ కు బజార్ హత్నూర్ మండల కేంద్రానికి చెందిన కొంగర్ల శేషబాయి భర్త పేరు కొంగర్ల గంగయ్య, శేషబాయి పేరు మీద రూపాయలు 16000/-ఋణం అప్పు బ్యాంక్ లో ఉంది.ఆమె భర్త 13జులై 2008 సంవత్సరం లో అనారోగ్యంతో మరణించారు.2008 సంవత్సర%శీ% తర్వాత శేషబాయి పేర బ్యాంక్ లో క్రాప్ లోన్ పొందుతుంది. ప్రస్తుతం కుటుంబ సర్వేలో భర్త ఆధార్ కావాలని అధికారులు అడుగుతున్నారు.భర్త చనిపోయే నాటికి ఆధార్ కార్డులఉనికిలేనేలేదు.ఇటు వంటి వారు రాష్ట్రములో చాలా మంది ఉండవచ్చు వారిని దృష్టిలో ఉంచులోని ప్రభుత్వం ఇచ్చిన గైడ్ లైన్స్ లో మార్పులు చేసి న్యాయం చేయాలని అంటున్నారు.

మరొక లొసుగు ఏమనగా ఒక ఊరిలో ఒక వ్యక్తి పేర పురుషుడు కావచ్చు, మహిళ కావచ్చు పట్టా భూమి ఉండి ఒంటరి జీవితం గడుపుతూ వ్యవసాయం కోసం సుమారు ఒక లక్షన్నర క్రాప్ లోన్ ఉన్న ఒంటరి అని ఋణం మాఫీ రాలేదు. కుటుంబ సర్వేలో మగవారు అయితే భార్య ఉండదు. మహిళ అయితే భర్త ఉండరు (ఉదాహరణ కు బ్రహ్మచారి, లేదా బ్రహ్మ చారిణి )అనుకుందాం.ఇలాంటి వారికి ఆధార్ ఒకటీ మాత్రమే ఉంటుంది. ఇలాంటి రైతులు కూడా రాష్ట్రంలో లేకపోలేదు తప్ప కుండా ఎక్కడో ఒకచోట ఉంటారు. ఇలాంటి రైతుల ఋణం మాఫీ కోసం కూడా ప్రత్యేకంగా ఆప్షన్ గైడ్ లైన్స్ లో ఏర్పాటు చేసి సంబంధిత వ్యవసాయ అధికారులు ప్రభుత్వం ద్రుష్టి కిసమస్య ను చేరవేసి రైతు ఋణం ప్రభుత్వం ఇచ్చిన హామీ ఖచ్చితంగా అమలు జరుగునట్లు తగిన విధంగా స్పందించి తగిన న్యాయం చేయాలని రైతులు కోరు తున్నారు.





## శ్రీ శివపుత్ర యూత్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన యూత్ సభ్యులు

**రఘునాథపల్లి, సెప్టెంబర్ 16 (డైలీ రిపోర్ట్):** రఘునాథ్ పల్లి మండల కేంద్రంలో శ్రీ శివపుత్ర గణేష్ యూత్ ఆధ్వర్యంలో గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కోళ్ల రవి గౌడ్, మాజీ ఎంపీటీసీ పెర్నె ఉషా రవి, గాదె మహేందర్, ఎండి భాషీమియా, యూత్ సభ్యులు పాల్గొన్నారు యూత్ సభ్యులు మరికుక్కల మధు, సాంబరాజు, ప్రశాంత్, మస్న రాజ్కుమార్, జంగిలి శ్రీను, ఎండి జవ్విత్, పెర్న్ వినోద్,రామగుండం హరీష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.67000 పలికిన రావుల పల్లి కాలాన్ వివేకానంద యూత్ గణపతి లడ్డు

### వేలం పాటలో పోటీ పడి లడ్డు దక్కించుకున్న శ్రీ రాములు గౌడ్

### రావుల పల్లి కాలాన్ గ్రామ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన లడ్డు

**శంకర్ పల్లి సెప్టెంబర్ 16 (డైలీ రిపోర్ట్):** గణపతి నవరాత్రి మహోత్సవంలో



భాగంగా జరిగే లడ్డు వేలం పాట కార్యక్రమం రావులపల్లి కలాన్ గ్రామంలో ఎంతో ఆసక్తిగా కొనసాగింది. తొమ్మిదవ రోజైన నిమర్జన ఊరేగింపు ఎంతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివేకనంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాగణపతి విగ్రహం వద్ద చివరి రోజైన 9వ రోజు ఆదివారం రోజున నిమజ్జనం సందర్భంగా వేలంపాట నిర్వహించారు. లడ్డు అత్యధికంగా రూ. 67000 పలకడం విశేషం. గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గౌండ్ల శ్రీరాములు గౌడ్ వేలం పాటలో పోటీపడి మరీ గణపతి లడ్డును దక్కించుకున్నారు. వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులు శ్రీరాములు గౌడ్ ని శాలువాతో ఘనంగా సత్కరించి, ఆ మహాగణ పతి ప్రసాదాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు గౌడ్ మాట్లాడుతూ ఆ మహాగణపతి ఆశీస్సులు మరియు కృప రావుల పల్లి గ్రామ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా మహాగణపతి విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించడం జరిగింది. ఊరేగింపులో భాగంగా భజనలు మరియు నృత్యాలతో ఊరేగింపు ఆసక్తిగా కొనసాగింది.ఈ నిమజ్జన కార్యక్రమంలో వివేకానంద అసోసియేషన్ సభ్యులు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## మిత్ర యూత్ గణేష్ లడ్డూను రూ. లక్ష 11 వేల 111 లకు కైవసం చేసుకున్న సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి

**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 16: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని చిన్న శంకర్‌పల్లి ఆరవ వార్డు హనుమాన్ మందిరంలో మిత్ర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డూను మండల సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి రూ. లక్ష 11 వేల 111 లకు కైవసం చేసుకున్నారు. మిత్ర యూత్ సభ్యులు సొసైటీ చైర్మన్ ను శాలువాతో ఘనంగా సన్మానించి లడ్డూను అందజేశారు. సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ లడ్డు వేలంలో పాలు పంచుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. దైవచింతలతోనే ఆధ్యాత్మిక చింతన ఏర్పడుతుందని సొసైటీ చైర్మన్ తెలియజేశారు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## వినాయక చతుర్థి అద్భుతమైన వేడుక

### మత, కుల, వర్గాలకు అతీతంగా అందరం 7 రోజుల పాటు గణేష్ పూజలో పాల్గొన్నాం





**16 సెప్టెంబర్ ( డైలీ రిపోర్ట్ ):** చేవెళ్ల మండలం ఊరెళ్ గ్రామంలోని గల్లి డాన్స్ యూత్ ఆధ్వర్యం లో పూజలు అందుకున్న బొజ్జ గణేషుడి ప్రసాదాన్ని మొహమ్మద్ మొయిస్ అనే ముస్లిం యువకుడు హిందూ యువకులతో పోటీగా వేలం పాటలో పాల్గొని గణేష్ ప్రసాదాన్ని చేజిక్కించుకున్నాడు. ఈ సందర్భంగా మొయిస్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి తను తన స్నేహితులు కలిసి గణేష్ లడ్డూ ప్రసాదాన్ని వేలంపాటలో దక్కించుకుంటున్నము అని కుల మతాలకు అతీతంగా మేము వేలంపాటలో పాల్గొనడమే కాకుండా ప్రతి రోజూ పూజలో పల్గొంటున్నము అని అన్నాడు. ఊరెళ్ళ గ్రామం లో గత అయిదు సంవత్సరాలు సర్పంచ్ గా పని చేసిన మొహమ్మద్ జహంగీర్ కూడా ముస్లిం కమ్యూనిటీ కి చెందిన వ్యక్తి అయినప్పటికీ తను కూడా ప్రతి హిందువుల పండగ దగ్గర ఉండి మరీ జరిపించేవారు అని గ్రామ ప్రజలు తెలిపారు. ఊరెల్ల బీఆర్ఎస్ యువ నాయకులు మొహమ్మద్ ఆసిఫ్ కూడా గ్రామం లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం తో పాటు ప్రతి రోజూ వినాయక పూజలో పాల్గొని గ్రామ ప్రజల నుండి ప్రశంశలు పొందుతున్నారు. మాకు ఎలాంటి కుల మత బేధాలు లేవు అని మేము చిన్నప్పటినుండి అందరం కలిసే ఉంటున్నాము మా పండగలకు హిందువులను పిలుస్తాము హిందువుల పండగలను మేము వెళ్తాము మమ్మల్ని ఎవరూ వేరు చేయలేరు అని వాళ్ళు చెప్పడం నిజంగా సంతోషకరం.

## ఎస్పీ రెసిడెన్సి గణపతి లడ్డును రూ. 5 లక్షల 51 వేలకు సొంతం చేసుకున్న చింతకింది మీనా మహేందర్ గౌడ్

**శేరిలింగంపల్లి: సెప్టెంబర్ 16: (డైలీ రిపోర్ట్):** శేరిలింగంపల్లి మండల పరిధి లోని ఆదర్శనగర్ రోడ్డు నెంబరు-2 లోని ఎస్పి రెసిడెన్సిలో ప్రతిష్టించిన వినాయకుడి లడ్డును వేలం పాటను తొమ్మిదవరోజు ఆదివారం నిర్వహించారు.5లక్ష 51 వెయ్యి రూపాయలకు చింతకింది మీనా మహెందర్ గౌడ్ కైవసం చేసుకున్నారు. వేలం పాటలో చింతకింది అమృత డాకయ్య గౌడ్ కుమారుడు మహెందర్ గౌడ్ వేలంపాటలో లడ్డును పాడి దక్కించుకున్నారు. గణేషుడి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిది రోజులు భక్తి శ్రద్ధలతో భజనలతో నిత్యాన్నదానాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా పూజలందుకొన్న మహిమగల్గిన “ఎస్పిరెసిడెన్సి గణనాథుడి లడ్డు” ను చింతకింది దంపతులు కైవసం చేసోవడం వరుసగా ఇది మూడోవసారి. గతేడాది 2023లో ?1.51లక్షలకు, 2022 లో ?2.21లక్షలకు వేలం పాటలో చింతకింది మీనా మహెందర్ గౌడ్ దంపతులు దక్కించుకున్న తెలిసిందే. వరుసగా మూడో సారి హ్యాట్రిక్ గా మహిమగల ఎస్పిరెసిడెన్సి లడ్డు తమకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నామని చింతకింది మహెందర్ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. వేలం పాటలో లడ్డు కైవసం చేసుకోవడానికి పలువురు పోటీ పడినప్పటికీ చివరికి మహేందర్ గౌడ్ కే ఆ ప్రతిష్టాత్మకమైన గణేషుడి మహాప్రసాదమైన “ఎస్పిరెసిడెన్సి లడ్డు “ దక్కింది. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ వాసులు బెజగం కేశవులు, మరాటి నర్సింహులు,గంగాధర సంతోష్ ,వేణుగోపాలచారి, శ్రావణ్ చారి, బాలాజీ, రత్నాకర్రెడ్డి, జనార్ధన్, రాజశేఖర్రెడ్డి, అంశపాల్రెడ్డి, లింగారెడ్డి, విజయలక్ష్మి, బాలమణి, నిర్మల, అపార్టుమెంటు వాసులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## విఘ్నాలు తొలగించే వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి: రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్

**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 16: (డైలీ రిపోర్ట్):** విఘ్నాలు తొలగించే మహా గణనాథుని చల్లని ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ అన్నారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లంబోదరునికి జ్యోతి భీమ్ భరత్ ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పంచే గణనాథునికి చల్లని ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని అన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో, పాడిపంటలతో ఉండాలని కోరుకున్నారు. అనంతరం మండల మన సాక్షి జర్నలిస్ట్ గండేటి రాజేష్ గౌడ్, రాజశ్రీ దంపతులు ఏర్పాటుచేసిన అల్పాహారంలో జ్యోతి భీమ్ భరత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో గణేష్ యూత్ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, జర్నలిస్టులు, మహిళలు పాల్గొన్నారు.



4 తెలంగాణ దినపత్రిక డైలీ రిపోర్ట్ మంగళవారం 17-09-2023




# నవ్వు లేని రోజు వృథా అంటున్న వెంకటేశ్


అగ్ర నటుడు వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. శిరీష్ నిర్మాతగా దిల్‌రాజు సమర్పణలో రూపొందుతోన్న ఈచిత్రం పొల్లాచ్చిలో భారీ షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. నెలరోజులకు పైగా జరిగిన ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై పాటలు, యాక్షన్ పార్ట్‌తో కూడిన కీలక సన్నివేశాలు చిత్రీకరించారు.వినాయకచవితి పర్వదినం సందర్భంగా సెట్‌లోని ఆహ్లాదకరమైన వాతావరణం చూపించే గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. అనే చార్లీ చాప్లిన్ కోట్ సూచిస్తూ నటీనటుల మధ్య ఆనందాన్ని, స్నేహాన్ని ఈ వీడియోలో ఆవిష్కరించారు.వెంకటేష్ సంప్రదాయ దుస్తుల్లో కళ్లద్దాలతో కనిపించగా, ఐశ్వర్యరాజేష్ ఆయన భార్య భాగ్య పాత్రలో, క్లాసిక్ చీరలో దర్శనమిచ్చింది. అలాగే మీనాక్షి చౌదరి ఎక్స్‌లవ్ పాత్రలో మోడ్రెన్ అవతార్‌లో కనిపించింది. మున్నార్ దగ్గర ఇంటర్వెల్ సీక్వెన్స్ చిత్రీకరించామని, సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేష్, వీటీ గణేశ్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్.

## రజనీకాంత్ వేట్టాయాన్‌లో తొలిపాట విడుదల.. ఏఐతో వాసుదేవన్ గాత్రం రీ క్రియేట్..

దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న మూవీ వేట్టాయాన్‌ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, రానా, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 10వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో వేట్టయాన్ సినిమాలోని తొలి పాట మనసిలాయో(లిరికల్ వీడియో)ను సోమవారం విడుదల చేశారు. చెన్నైలో జరిగిన ఓ బూటకపు ఎన్‌కౌంటర్ ఇతివృత్తగా ఈ సినిమాను రూపొందించారు.ఈ పాట కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో దివంగత గాయకుడు మలేషియా వాసుదేవన్ గాత్రాన్ని రీ క్రియేట్ చేశారు. దీప్తి సురేశ్, యుగేంద్రన్, అనిరుధ్ ఈ పాటను ఆలపించారు.

# విఫల ప్రేమకథ.. బ్రేకప్ నిజంగా చాలా బాధాకరం: తమన్నా

ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన విఫల ప్రేమకథల గురించి గుర్తుచేసుకుంది మిల్కీబ్యూటీ తమన్నా. ఆమె హృదయం ఇప్పటికి రెండు సార్లు ముక్కలైందట. ఈ విషయంపై తమన్నా మాట్లాడుతూ 'బ్రేకప్ నిజంగా చాలా బాధాకరం. అది అనుభవించిన వారికే తెలుస్తుంది. నా జీవితంలో రెండుసార్లు బ్రేకప్‌ని ఎదుర్కొన్నాను. టీనేజ్‌లో ఉన్నప్పుడే తొలి హార్ట్‌బ్రేక్ ఎదురైంది. జీవితంలో ఏదోఒకటి సాధించాలనేది నా అభిమతం. ఓ వ్యక్తికోసం లక్ష్యాన్ని వదులుకోవడం నచ్చలేదు. ఆ కారణంలో ఓ బంధం తెగిపోయింది. అది జరిగిన కొన్నేళ్ల తర్వాత ఓ వ్యక్తిని ఇష్టపడ్డా. అతనితో కొంతకాలం రిలేషన్లో ఉన్నా. అతను మాట్లాడితే అబద్ధాలే. అనవసరంగా అబద్ధాలాడేవాళ్లంటే నాకు అసహ్యం. తను నాకు సెట్ కాదని మనసు చెప్పింది. దాంతో అతడ్ని కట్ చేయక తప్పలేదు.' అని గత జ్ఞాపకాలను నెమరు వేసుకుంది.





# ఆ వార్తలే నిజమయ్యాయి..

## విడాకులు ప్రకటించిన స్టార్ హీరో



తెలుగు, తమిళ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ జయం రవి ఈ కోలీవుడ్ స్టార్ యాక్టర్ తన సతీమణి ఆర్తితో విడాకులు తీసుకుంటున్నాడంటూ కొంతకాలంగా నెట్టింట చక్కర్లు కొడుతున్న వార్తలు నిజమయ్యాయి. తన సతీమణితో 15 ఏండ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ విడాకులను ప్రకటించాడు జయం రవి. వ్యక్తిగల కారణాలు, కీలక అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కఠిన నిర్ణయం తీసుకున్నాం. ప్రతీ ఒక్కరూ మా ప్రైవసీని గౌరవిస్తారని విజ్ఞప్తి చేస్తున్నానని సోషల్ మీడియాలో ఓ సందేశాన్ని జయం రవి అందరితో పంచుకున్నాడు .ప్రముఖ టెలివిజన్ ప్రొడ్యూసర్ అయిన సుజాత విజయ కుమార్ కూతురు ఆర్తి. జయం రవి-ఆర్తికి ఇద్దరు కుమారులు. జయం రవి చివరగా పొన్నియన్ సెల్వన్ 2తో సక్సెస్ అందుకున్నాడు. ఈ సినిమా తర్వాత వచ్చిన చిత్రాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయాయి. జయం రవి ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తుండగా.. షూటింగ్ దశలో ఉన్నాయి.

# ఒకే ఫ్రేమ్‌లో సందీప్ రెడ్డి వంగా, జూనియర్ ఎన్టీఆర్



అర్జున్ రెడ్డి సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు సందీప్ రెడ్డి వంగా తొలి సినిమాతోనే నెట్టింట హాట్ టాపిక్‌గా మారాడు. ఇక రణ్‌బీర్‌కపూర్‌తో తెరకెక్కించిన యానిమల్ వసూళ్ల వర్షం కురిపించింది. ఈ క్రేజీ డైరెక్టర్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ తో కలిసి ఉన్న ఫొటో ఒకటి ఇప్పుడు నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. తారక్ నటించిన దేవర ట్రైలర్‌ను సెప్టెంబర్ 10న గ్రాండ్‌గా లాంచ్ చేయబోతున్న విషయం తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా, తారక్ చర్చించుకుంటున్న స్టిల్ చూసిన మూవీ లవర్స్.. ఏంటీ ఈ ఇద్దరు సినిమాకు ఏమైనా ప్లాన్ చేస్తున్నారా..? అంటూ మాట్లాడుకుంటున్నారు. అయితే ఈ క్రేజీ సెలబ్రిటీల కలుసుకోవడం వెనుక సీక్రెట్ ఏమీ లేదని.. ఇద్దరిదీ కేవలం సరదా డిస్కషన్ మాత్రమేనని ఇన్‌సైడ్ టాక్. ఇదిలా ఉంటే అభిమానులు మాత్రం అర్జున రెడ్డి దర్శకుడు తారక్ కోసం సెన్సేషనల్ స్టోరీ రాయాలని భావిస్తుండగా.. మరి రానున్న రోజుల్లో ఈ ఇద్దరి కాంబోలో సినిమా ఏమైనా వస్తుందేమో చూడాలి.కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న దేవర రెండు పార్టులుగా రాబోతుండగా.. పార్టు 1 సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సైఫ్ అలీఖాన్, ప్రకాశ్ రాజ్, షైన్ టామ్ చాకో, శ్రీకాంత్, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# క్యూరియాసిటీ పెంచుతోన్న సుధీర్ బాబు.. మా నాన్న సూపర్ హీరో ఫస్ట్ లుక్

ఈ ఏడాది హరోంహర సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు సుధీర్‌బాబు. ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న తాజా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. ఇప్పటికే ఫాదర్స్ డేసందర్భంగా రిలీజ్ చేసిన ప్రీలుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ షేర్ చేశారు.చేతక్ బండిపై కూరగాయలు తీసుకెళ్తున్న సుధీర్ బాబు, స్కూల్‌కెళ్తున్న చిన్నారికి షేక్ హ్యాండ్ ఇవ్వడం ఫస్ట్ లుక్ పోస్టర్‌లో చూడొచ్చు. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. 'లూసర్' వెబ్‌సిరీస్ ఫేం అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వి సెల్యులాయిడ్, సీఏఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో విభిన్న కథాంశంతో ఈ మూవీని తెరకెక్కించబోతున్నామని ఇప్పటికే క్లారిటీ ఇచ్చేశాడు దర్శకుడు.ఈ మూవీలో సాయిచంద్, షాయాజీషిండే, రాజు సుందరం, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీకి జై క్రిష్ సంగీతం అందిస్తుండగా..సునీల్ బలుసు నిర్మిస్తున్నారు.




Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707